క్లుప్తంగా

1 నుంచి ఏపీజీబీగా పేరు మార్పు

ఆమదాలవలస: మే 1వ తేదీ నుంచి పలు గ్రామీణ బ్యాంకులను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్పు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు కృష్ణాపురం శాఖ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంక్‌లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటిగా చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు యూనియన్ బ్యాంకు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారుతున్నట్లు పేర్కొన్నారు. ఖాతా నంబర్‌లో మార్పు ఉండదని, లావాదేవీలకు ఎలాంటి ఆటంకం ఉండదని, ఖాతాదారులకు అందించే సేవల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. ఖాతాదారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా.. సంబంధిత బ్యాంకు శాఖల్లో సంప్రదించాలన్నారు. ఖాతాదారులు, ప్రజలు సహకరించాలి కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఐసీడీఎస్ సిబ్బంది


బూర్జ: అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు అన్నారు. బూర్జ ఐసీడీఎస్ పరిధిలోని డొంకలపర్త గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పి.రత్నం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి జెడ్పీటీసీ అవగాహన ర్యాలీ చేపట్టారు. మహిళా పోలీసు వై.ఇంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు జె.రమణమ్మ, వై.మంజుల, కె.సరస్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టు సభ్యులు

నరసన్నపేట: స్థానిక ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నరసన్నపేట పట్టణంలోని ఉమామహేశ్వరాలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ట్రస్టు కన్వీనర్ మార్పు విజయకుమార్ ప్రారంభించారు. గత మూడేళ్లుగా వేసవిలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ వరకు దీనిని కొనసాగిస్తామని, రోజుకు 600 లీటర్ల మజ్జిగ పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్టు ప్రతినిధులు పూర్ణారావు, రోణంకి కృష్ణంనాయుడు, బోయిన బాలకృష్ణ, రమణ సాహు, మావుడూరి జగదీష్ బాబు, పి.రమేష్, ఊణ్ణ సోమేశ్వరరావు, ఊణ్ణ రమేష్, మార్పు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం


అదనపు తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణ శివార్లలోని తాళ్లవలస వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.40 లక్షల వ్యయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు తరగతి గదులను శుక్రవారం ప్రారంభించారు. రూ.2.55 కోట్ల నిధులతో ఇదే పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ప్రిన్సిపాల్ పి.శిరీష, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సత్యవరం, దూకులపాడు గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కేశవరావు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ధనుష్ అనే విద్యార్థి 572 మార్కులతో పాసయ్యారన్నారు. 500 మార్కులకు పైబడి 9 మంది విద్యార్థులు సాధించారన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలన్నారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో.. భూసారం


దేవాది వద్ద నవధాన్యాల ద్వారా సాగు చేసిన పొలం

- రసాయనిక ఎరువులతో తగ్గుతున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయంతో సమస్యలకు చెక్
- నరసన్నపేట నియోజకవర్గంలో 7,400 కిట్లు పంపిణీకి లక్ష్యం

నరసన్నపేట: భూతాపం తగ్గాలన్నా.. భూసారం పెరగాలన్నా.. మనం తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రసాయనిక ఎరువుల వలన భూసారం బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఆ భూములను మళ్లీ సారవంతంగా చేయాలంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు సూచిస్తున్నారు. భూసారం తగ్గిన పొలాల్లోనే కాకుండా చౌడు భూములు సైతం మళ్లీ సారవంతం కావాలంటే రైతులు ఖరీఫ్ సీజన్‌కు ముందే నవధాన్యాల సాగు చేయాలి. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్లును రూ.1,100 అందజేస్తున్నారు. ఈ కిట్‌లో 25 రకాల విత్తనాలు ఉంటాయి. ఇలా మిశ్రమ విత్తనాల సాగు వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతం అవుతోంది. నరసన్నపేట నియోజకవర్గంలో గతేడాది 2,010 ఎకరాల్లో పకృతి వ్యవసాయం సాగుచేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 7400 ఎకరాల్లో సాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.


సిద్ధం చేసిన నవధాన్యాలు

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు ఇవే..

- పొలంలో నవధాన్యాలను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు నత్రజని, సూపర్ ఫాస్పేట్ అదనంగా అందుతుంది.
- జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. వేరు వ్యవస్థ అభివృద్ధి చేస్తాం.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడంతో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోనికి మారుస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.
- నాణ్యమైన గింజలు ఉత్పత్తి అవుతాయి. దిగుబడి రెట్టింపు అవుతుంది.

సాగు చేసే విధానం ఇలా..

వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే పొలంలో చల్లు కోవాలి. నవధాన్యాలు వేసిన 45 రోజులు వ్యవధిలోని పూత దశలో దమ్ము చేయాలి. పశువుల మేతకు ప్రయోజనం. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం. చల్లుకుని కలియ దున్నుకోవచ్చు.

ప్రయోజనం



ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఖరీఫ్‌లో నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,010 నవధాన్యాల కిట్లు పంపిణీ చేశాం. ఈ ఖరీఫ్‌కు 7,400 కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు ప్రయోజనం పొందుతున్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. ఈ నవధాన్యాల కిట్లు ద్వారా 55 రకాల పోషకాలు అందుతాయి. – తోట రమణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్

ఆసక్తి పెరిగింది



ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఈ వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు ఎంతో మేలు. ఇది భూసారం పెంపొందిస్తోంది. రసాయనిక ఎరువుల ద్వారా రానురానూ భూసారం తగ్గుతుంది. ఈ ఖరీఫ్‌లో మరింతగా రైతులు రసాయనిక ఎరువులు తగ్గించాలని సూచనలు చేస్తున్నాం. – కె. సునీత, వ్యవసాయాధికారి, నరసన్నపేట

గెడ్డ ఇలా.. సాగునీరు ఎలా?



ఆమదాలవలస మండలంలోని దూసి గెడ్డలో పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. ప్రతి ఏటా ఉపాధి హామీ పథకం కింద పిచ్చిమొక్కలు తొలగించటమే కాకుండా.. కొంతమేర పూడిక తీసేవారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కాలువలో పిచ్చిమొక్కలు తొలగించలేదు. ఇలాగే ఉంటే రానున్న ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చొరవచూపి పిచ్చిమొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. – ఆమదాలవలస రూరల్

అసంపూర్తిగా..



సారవకోట మండలంలోని కేశవలస పంచాయతీ పద్మాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వంట గది కొన్నేళ్ల నుంచి అసంపూర్తిగా ఉంది. విద్యాశాఖ ద్వారా నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ఏళ్లు కావస్తున్నా వంట గది పూర్తికాక పోవడంతో వంట ఏజెన్సీ సభ్యులు సమీపంలో ఉన్న చెట్లు కింద వంటలు చేయాల్సి వస్తోంది. – సారవకోట

నిర్మానుష్యం..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస వద్ద శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న అలికాం–బత్తిలి రోడ్డు. గత వారం రోజులుగా ప్రతీ రోజు 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలైతే చాలు అడుగు తీసి బయట పెట్టాలంటే ప్రజలు భయపడుతున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ఉక్కపోతకు ఇక్కట్లు పడుతున్నారు. జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. – సరుబుజ్జిలి

నరకయాతన..



సరుబుజ్జిలి మండలంలోని సుభద్రాపురం గ్రామం నుంచి దకరవలస వరకు రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. రహదారి మొత్తం రాళ్లుతేలి ఉండడం వలన రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు. తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

తమ్మినేనికి అభినందనలు


తమ్మినేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంతారావు, పార్టీ నాయకులు


సీతారాంను అభినందిస్తున్న గోవిందరావు, నాయకులు

ఆమదాలవలస: మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తమ్మినేని సీతారాంకు పీఏసీ మెంబర్‌గా పార్టీ అధిష్టానం ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. సీతారాంను ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. సీతారాం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు చల్లా సింహాచలం, గొంటి కృష్ణ, బెండి జయరాం తదితరులు ఉన్నారు. తమ్మినేనికి పొందూరు జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాడాన సునీల్, వైస్ ఎంపీపీ వండాన సూరపునాయుడు అభినందించారు. సీతారాంకు ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన పార్టీ మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్తా విజయ్, కార్యకర్తలు మెట్ట కృష్ణ, కూన సురేష్, సనపల అనంతరావు, సనపల రవి, తదితరులు అభినందనలు తెలిపారు.


సీతారాంను అభినందిస్తున్న అల్లంశెట్టి, పార్టీ నాయకులు

ఏబీ రోడ్డు విస్తరణకు చర్యలు


ఏబీ రోడ్డులో సర్వే నిర్వహిస్తున్న ప్రతినిధులు

హిరమండలం: అలికాం–బత్తిలి రోడ్డులో లీ అసోసియేట్ సంస్థ శుక్రవారం సర్వే చేపట్టింది. ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ, ఆర్‌అండ్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. అంతర్ రాష్ట్ర రహదారుల్లో వాహనాల రద్దీ, ప్రయాణీకుల సంఖ్య, రహదారుల అభివృద్ధి, విస్తరణ తదితర అంశాలో భాగంగా సర్వే నిర్వహించినట్టు తెలుస్తోంది. ఈ సర్వేకు అనుగుణంగా రహదారులు, ఆర్టీసీ బస్సు సర్వీసుల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థ అన్ని రాష్ట్ర రహదారుల్లో సర్వే చేసినట్టు లీ అసోసియేట్ సంస్థ ఇంజినీర్ తెలిపారు.

ఉగ్రదాడి అమానుషం


ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

ఎల్.ఎన్.పేట: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని గ్రామానికి చెందిన అనిత పాణిగ్రాహి ఆధ్వర్యంలో ఒరియా బ్రాహ్మణ వీధిలో పలువురు చిన్నారులు ర్యాలీ చేపట్టారు. అమాయకుల ప్రాణాలను తీయటం అమానుషమన్నారు.

పశు వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి


సింహాచలం

బూర్జ: మండల కేంద్రంలోని పశువైద్యాధికారి బి.జోత్స్న, కొల్లివలస పశు వైద్యాధికారి జి.వెంకటరావు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని పాడి రైతుల నుంచి వచ్చే ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పాడి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులతో దర్యాప్తు చేపట్టాలన్నారు. మండలంలో పని చేసిన పశువైద్యాధికారులు ఒక్కపూటే విధులు నిర్వహించడంతో వైద్యం కోసం తీసుకువచ్చిన మూగజీవాలకు సరైన వైద్యం అందడంలేదన్నారు.

పరామర్శ..


హరిని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

జలుమూరు: మండలంలోని పలు కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. రామయ్యవలస సర్పంచ్ శిమ్మ నాగేశ్వరరావు కుమారుడు హరి, కూర్మనాథపురం గ్రామానికి చెందిన చల్ల గోవిందరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పైడి విఠలరావు, పొన్నాన విజయ్, మెండ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్యాణం శ్రీనివాసరావు, రెడ్డి అప్పారావు, సంతోష్, కొర్ను రాజు, మొయ్యి మన్మథరావు తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తూరు: ఈ నెల 26 తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

మద్యం షాపు తరలించాలి


ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఏబీహెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తరలించాలని కాలనీ వాసులు కోరారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే వెంటనే ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావుతో మాట్లాడారు. ఏబీహెచ్‌బీ కాలనీలో మద్యం షాపును తక్షణమే అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. తొలుత ఏబీహెచ్‌బీ కాలనీ వాసులు ప్రహరాజపాలెంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి వెళ్లి కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తరలించాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దుక్క శ్రీకాంత్, సలాన చిరంజీవి, రేగేటి ఆనందరావు, గేదెల రామారావు, కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బోరును ఆస్పత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్ శుక్రవారం ప్రారంభించారు. ఆస్పత్రికి వస్తున్న రోగులు మంచి నీటి కోసం అవస్థలు పడటంతో కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి.. పంచాయతీ నిధులతో బోరును తవ్వించారు. గైనికాలజిస్టు అనురాధ, పడాల లక్ష్మణరావు, ఎల్.జనార్దనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర రిజర్వాయర్ వద్ద అలికాం–బత్తిలి రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొండకు చెందిన దిలీప్ సింగ్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై వస్తున్న దిలీప్ సింగ్‌ను మెట్టూరు నుంచి కొత్తూరు వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దిలీప్ సింగ్‌కు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనం

హిరమండలం మండలంలోని తులగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హిరమండలంలోని కళ్యాణ మండపంలో 1999–2000 టెన్త్ విద్యార్థులు సమావేశమయ్యారు. వంశధార రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా తులగాం నిర్వాసిత గ్రామంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాతికేళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. రోజంతా సందడిగా గడిపారు. బ్యాచ్‌లోని పేద విద్యార్థులను ఆదుకునేందుకు నిర్ణయించారు. ఏటా పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు కొవగాపు నవీన్‌కుమార్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. – హిరమండలం

మలేరియాపై అప్రమత్తం


సారవకోట: నినాదాలు చేస్తున్న బొంతు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

సారవకోట: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని బొంతు పీహెచ్‌సీ వైద్యురాలు సుస్మిత సూచించారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా బొంతు పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వలన మలేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇల్లు, పరిసరాల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వైద్యులు సుధారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్కులపేటలో..

ఆమదాలవలస రూరల్: మలేరియా నిర్మూలన మనందరి బాధ్యతని అక్కులపేట వైద్యాధికారి బి.వసంత అన్నారు. మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. వ్యాధి లక్షణాలను వివరించారు. ఈఓ జనార్దనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్లాంలో..

నరసన్నపేట: మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే దోమలను నివారించవచ్చని, తద్వారా మలేరియా నిర్మూలన చేయవచ్చని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సుజాత అన్నారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఉర్లాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ర్యాలీలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కురిగాంలో..

కొత్తూరు: మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కురిగాం పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈవో బుజ్జిబాబు మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రజలు సహకరించాలన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్ తిరుపతిరావు, ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న అక్కులపేట పీహెచ్‌సీ సిబ్బంది


నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఉర్లాం పీహెచ్‌సీ సిబ్బంది


కొత్తూరు: కురిగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది